క్లుప్తంగా

ఆరేటమ్మ ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

పుత్తూరు రూరల్: గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాలనీకి చెందిన కృష్ణవేణి, నరేంద్రబాబు దంపతులు దశమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా, వారికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కె.మనోహర్‌రెడ్డి పర్యవేక్షించారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

విజయపురం (నగరి) : ఆంధ్రా– తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న విజయపురం మండలంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఏఎస్‌ఐ లోకనాథం మంగళవారం గాండ్లకండ్రిగ చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే వాహన రికార్డులను పరిశీలించారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ వాడాలని, ఆటోల్లో పరిమితికు మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రోడ్డు రవాణా నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

నగరి : డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్త, హెల్పర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 11 పోస్టులకు గాను 19 మంది హాజరయ్యారు. నగరి మండలానికి సంబంధించి 5 పోస్టులకు గానూ 11 మంది హాజరయ్యారు. నిండ్ర, విజయపురం, పాలసముద్రం మండలాల్లో ఒక్కో పోస్టుకు ఒక్కొక్కరి చొప్పున హాజరయ్యారు. కార్వేటినగరం మండలంలో 3 పోస్టులకు గానూ ఐదుగురు పాల్గొన్నారు. వీరిని ఆర్డీఓ సుజన, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.నాగశైలజ, జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ రవిరాజు, నగరి, కార్వేటినగరం, పిచ్చాటూరు సీడీపీఓలు కె.కృష్ణవేణి, ఎ.పద్మసునంద, పీజేడీ శోభారాణి ఇంటర్వ్యూ చేశారు. కార్యాలయ సిబ్బంది కరుణాకర్ రెడ్డి, గిరిజమ్మ, సుకన్య, శ్రీహరి గోపి, పూర్ణచంద్ర, రామకృష్ణ ఇంటర్వ్యూల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ ఆంజనేయులు

విజయపురం (నగరి) : మండలంలో నాడు–నేడు రెండో విడత పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మంగళవారం ఎంఈఓ ఆంజనేయులు నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే మండలంలో 17 పంచాతీయల్లో సుమారు రూ.4 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. పాఠశాలలకు అవసరమైన విద్యుత్ పరికరాలు, టేబుళ్లు వచ్చాయని తెలిపారు.

నేటి నుంచి మహాభారత ఉత్సవాలు



పుష్పాలంకరణతో అమ్మవారి ఆలయం

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో బుధవారం నుంచి మహాభారత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బండి ఉమాపతిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బుధవారం ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. అదేరోజు మధ్యాహ్నం నుంచి భాగవతారిణి నాగరత్న హరికథా కాలక్షేపం ఉంటుందన్నారు. గురువారం నుంచి శ్రీ వేంకటేశ్వర నాట్య కళా మండలి మేనేజర్ బొమ్మయ్యపల్లె కిరణ్ ఆధ్వర్యంలో రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. 4న ఆదివారం బండి కుంభాలు, 5న సోమవారం అమ్మవారి కల్యాణోత్సవం, అన్నదానం, 6న మంగళవారం ద్రౌపదీ మానసంరక్షణ, 7న బుధవారం అర్జున తపస్సు, 9న శుక్రవారం ఉత్తరగోగ్రహణం, 10న శనివారం ఇలావంతుని వధ, 11న ఆదివారం దుర్యోధన వధ, ధర్మరాజుల పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

నంది వాహనంపై ఆదిదంపతులు





అధికార నంది వాహనంపై విహరిస్తున్న శివపార్వతులు, విద్యుద్దీప కాంతుల్లో సదాశివేశ్వరాలయం

పుత్తూరు రూరల్: శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శివపార్వతులు అధికార వాహనమైన నందీశ్వరున్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం భిక్షాటన ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, సుగంధ పరిమళ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి నందీశ్వరుడిపై ఆశీనులను చేశారు.

మహిళల కోలాట నృత్యాలు, మేళతాళాలు, వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది. ఈ సందర్భంగా ఇంటింట కర్పూర హారతులను స్వీకరించిన శివపార్వతులు భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని విశేషసంఖ్యలో వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గంగమ్మకు పొంగళ్లు



అమ్మవారికి పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని వీరకనెల్లూరు గ్రామంలో వెలసిన శ్రీనడివీధి గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం మహిళలు పొంగళ్లు వండి, పిండిదీపాలు పెట్టి, కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఏటా గ్రామస్తులు గంగ జాతరను కుల, మతాలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ గ్రామ జాతరకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ గ్రామం నుంచి పెళ్లి చేసుకుని వెళ్లిన ప్రతి ఆడపడుచు తప్పక హాజరై అమ్మవారికి పొంగళ్లు సమర్పించడం ఆనవాయితీ. దీంతో ఆలయం మహిళలతో నిండిపోయింది. జాతరలో భాగంగా నడివీధి గంగమ్మను రాత్రి పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ బాణసంచా పేలుళ్ల మధ్య పురవీధుల్లో ఊరేగించారు.



వెదురుకుప్పం: పాతగుంటలో అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సర్పంచ్ భువనేశ్వరి

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో ఉన్న కరకమాని గంగమ్మ ఆలయంలో అమ్మవారి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమను పుష్పపల్లకీపై ప్రతిష్ఠించి ఊరేగింపు చేపట్టారు. మహిళలు మంగళ హారతులు, కర్పూర నీరాజనాలతో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా స్థానిక సర్పంచ్ భువనేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు బొజ్జారెడ్డి కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే చెన్నుగారిపల్లెలో, పల్లాలు గ్రామంలో గంగ జాతరను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు.

శ్రీహరిపురంలో వైద్యశిబిరం

విజయపురం(నగరి) : మండలంలోని శ్రీహరిపురం సచివాలయ పరిధి మల్లారెడ్డికండ్రిగలో పీహెచ్‌సీ డాక్టర్ సోమశేఖర్ మంగళవారం రెండవ రోజు ఉచిత వైద్యశిబిరం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. వేడిచేసి చల్లార్చిన నీటినే తీసుకోవాలని సూచించారు. రాత్రిపూట దోమతెర, లేదా చేతులు పూర్తి కప్పి ఉండేలా దుస్తులు ధరించాలన్నారు. రెండురోజుల పాటు జ్వరం తగ్గకపోతే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తపరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్షం.. హర్షం



నగరిలో కురుస్తున్న వర్షం

నగరి : పట్టణ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో వర్షం కురిసింది. గాలులు పెద్ద ఎత్తున వీయడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి తెగిన విద్యుత్ తీగలను సరిచేసి విద్యుత్ సరఫరాను అందించారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : మండలకేంద్రం విజయపురంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం పడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. అయితే సాయంత్రం వర్షం పడడంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. సుమారు గంటపాటు వర్షం పడింది. పలుచోట్ల వర్షపునీరు ప్రవహించింది. అలాగే ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షం ఎంతో ఊరటనిచ్చింది

నాగాలమ్మ ఆలయంలో కుంభాభిషేకం

విజయపురం (నగరి) : మండల కేంద్రం విజయపురం గ్రామంలో వెలసిన శ్రీ నాగాలమ్మ ఆలయంలో మూడురోజుల పాటు జరిగే కుంభాభిషేకం మంగళవారం ప్రారంభమైందని ఆలయ అర్చకులు వందవాసి మహేష్‌శర్మ తెలిపారు. ఆలయ ఆవరణలో పచ్చని చలువ పందిరి ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం ఆలయంలో గణపతిపూజ, స్వస్తివచనం, రక్షాబంధం, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, వాస్తుపూజ, ప్రవేశబలి కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కుంభాభిషేకం మహోత్సవానికి చుట్టుపక్కల భక్తులు పాల్గొని నాగాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

వడమాలపేట: మండల పరిధిలో అప్పలాయగుంటలోని టీటీడీ అనుబంధంగా ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చక, వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. మంగళవారం రాత్రి 7.30 గంటల నుంచి 9.30 మధ్య మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆలయంలో 6.30 గంటల నుంచి 7 గంటల వరకు ఆగమోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. అలాగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు వేశారు. ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



గొడుగులు తీసుకొస్తున్న అర్చకులు, అధికారులు

నగరి పట్టణాభివృద్ధే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్



హాజరైన కౌన్సిలర్లు అధికారులు

- పట్టణంలో తాగునీటి సరఫరాకు రూ.15.86 కోట్లు మంజూరు
- ప్రతి వార్డులో అభివృద్ధికి ప్రాధాన్యత
- కౌన్సిల్ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తాం
- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం

నగరి : నగరి పట్టణాభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. మంగళవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. దీనిపై కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ తాగునీరు శుద్ధీకరణను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అలాగే జగనన్న కాలనీలో అదనంగా మరో రెండుబోర్లు వేసి మరింత ఎక్కువగా నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి రోజా చొరవతో అమృత పథకంలో తాగునీటి సరఫరాకు రూ.12.86 కోట్లు మంజూరయ్యాయని, అలాగే జగనన్న కాలనీల్లో నీటి సరఫరాకు రూ.3.50 కోట్లు, మొత్తం రూ.15..88 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. ఈ నిధులతో తాగునీటి ట్యాంకులు, బోర్లు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత అవసరానికి జనరల్ ఫండ్స్‌లో రెండు బోర్లు వేయిస్తామన్నారు. కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నగరి శ్మశానంలో ఆకతాయిల కారణంగా అపరిశుభ్రం అవుతోందని, ప్రహరీ నిర్మించి గేటు వేసి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ సమాధానం ఇస్తూ శ్మశానంలో క్రిమేషన్ షెడ్డుకు రూ.35 లక్షలు మంజూరైందని, ఆ పనులు చేసే సమయంలో ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు, వాచ్‌మెన్‌ను నియమిస్తామన్నారు. కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిరుపయోగంగా ఉన్న ఈటీపీని ప్రస్తుతం మంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపి నిర్వహణలోనికి తెచ్చారని, అయితే కొందరు డైయింగ్ యూనిట్ యజమానులు అధికారుల కన్నుగప్పి ఈటీపీకి రంగునీటిని తరలించకుండా నదిలోకి, కాలువల్లోకి వదులుతున్నారని తెలిపారు. దీనిపై మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు, అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తామని, ఈటీపీతో అనుసంధానం కాకుండా కాలువల్లోను, నదిలోను రంగునీరు వదలిపెట్టే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి 17వ వార్డులో శ్మశానానికి ప్రహరీగోడ కావాలన్నారు. అలాగే పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదని, సంబంధిత అధికారులు ఆ ప్లాట్లలో సర్దుబాట్లు చేయాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు సూచించారు. సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ శేఖర్, టీపీఓ నీరజాక్షి, మెప్మా అధికారి సునీత, ట్రాన్స్‌కో ఏఈ మోహన్, రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మజాతర

కార్వేటినగరం: మండల పరిధిలోని గంగమాంబాపురం చెరువులో వెలసిన గంగమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవారికి ప్రీతికరమైన అంబలిని సమర్పించారు. ట్రాక్టర్లలో అంబలిని ఆలయానికి తీసుకెళ్లి అభిషేకించారు. ఆలయ ఆవరణలో మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు వండి పిండిదీపాలతో అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ నేపథ్యంలో గ్రామ వీధులను వేపాకు తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి రాత్రి గ్రామ వీధుల్లో కేరళ వాయిద్యాలు, తమిళనాడు నుంచి గరగాటం, ప్రత్యేక వాయిద్యాలు, బాణసంచాలు పేలుస్తూ అమ్మవారిని ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న కృపాలక్ష్మి

గంగమాంబపురం గ్రామంలో జరుగుతున్న గంగ జాతరను సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టాభిరెడ్డి, హరిరెడ్డి, డిల్లీరెడ్డి, గ్రామస్తులు డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మిని శాలువలు కప్పి గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఆమె వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్‌లు ధనుంజయవర్మ, శేఖర్‌రెడ్డి, సర్వేశ్వర్, నాయకులు శేషాద్రి, చందురాజు, పురంధర్, గోపి, దాము, అర్జునయ్య, శోభన్‌బాబు ఉన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి

పేదల పక్షపాతి సీఎం జగనన్న



పెనుమూరులో సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్వేటినగరం: పేదరిక నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తూ సంక్షేమ పథకాలతో ఆర్థిక సమానత్వాన్ని తీసుకొచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా నిలిచారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం గంగమాంబాపురంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కృపాలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగనన్న అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. పురుషులకు సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణించేలా రిజర్వేషన్ కల్పించి మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని అన్నారు. మరోమారు సీఎం జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. పేదలు కూడా ధనికులతో సమానంగా సమాజంలో ఎదగాలంటే అది సీఎం జగనన్నతోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించి, టీడీపీ పార్టీని భూస్థాపితం చేయాలని కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనుంజయవర్మ, పట్టాభిరెడ్డి, శేషాద్రి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, దాము, గోపి, పురంధర్, చందురాజు, శేఖర్‌రెడ్డి, మురగయ్య, శోభన్‌బాబు, అర్జునయ్య, రాజశేఖరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు నాలుగేళ్లు

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్): రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పెనుమూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దూదిమోహన్, యతీశ్వర్‌నాయుడు, పండరీనాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయండి



కల్యాణపురం కాలనీలో పైపులైను పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం 20వ వార్డులోని కల్యాణపురం ఎస్టీ కాలనీలో 15వ ఆర్థికసంఘం నిధులతో చేపడుతున్న తాగునీటి పైపులైన్ల పనులను కమిషనర్ పరిశీలించారు. వైఎస్సార్ మున్సిపల్ పార్కులో మరమ్మతులకు గురైన జిమ్ పరికరాలను బాగు చేయించారు. పార్కులో మొక్కల పెంపకంతో పాటు, ఆట వస్తువులు, జిమ్ పరికరాల వినియోగంపై సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పూలకుండీల ఏర్పాట్లను పరిశీలించారు. కమిషనర్ వెంట శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రెటరీ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ

వెదురుకుప్పం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నాగరాణి అన్నారు. మంగళవారం మండలంలోని గంటావారిపల్లె గ్రామంలో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యవసాయం, పంటల సాగులో చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనాథరెడ్డి(గంటావారిపల్లె), కావేరి(జక్కిదొన), అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విత్తనకాయలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగరాణి

ఆర్ఎంపీ క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు

శ్రీరంగరాజపురం: రాష్ట్రప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసౌకర్యాలు అందించడానికి కోట్లు వెచ్చిస్తోందని, ఏదైనా రోగం వస్తే ప్రభుత్వాస్పత్రులకే వెళ్లాలని మండల వైద్యాధికారి సందీప్ రాజ్ తెలిపారు. గతవారం కిందట జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు నకిలీ వైద్యుల ఆగడాలపై చర్చించిన నేపథ్యంలో డాక్టర్ పల్లవి, సందీప్‌రాజ్ మంగళవారం మండలవ్యాప్తంగా ఉన్న ఆర్ఎంపీ, పీఎంపీ, మెడికల్ షాపుల్లో తనిఖీ చేశారు.

మండలకేంద్రంలోనే ఆర్ఎంపీగా చలామణి అవుతున్న దొరబాబు వద్ద ఎలాంటి విద్యార్హత ధ్రువపత్రాలు లేకపోవడంతో అనుమానం వచ్చి క్షుణ్ణంగా పరిశీలించారు. అతను రోగులకు హైడోస్ మందులు, మాత్రలు ఇస్తున్నట్లు గుర్తించారు. దీనికితోడు క్లినిక్‌లలో విచ్చలవిడిగా సిరంజీలను వాడుతుండడంపై ప్రశ్నించారు. అతను నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో మండల వైద్యాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం పేదల కోసం కోట్లు వెచ్చి ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు అందిస్తోందని, అందువల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని సూచించారు.



మండలకేంద్రంలోని ఓ ఆర్ఎంపీ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న వైద్యాధికారి సందీప్‌రాజ్